

# బౌద్ధనగర్‌లో ఇఫ్తార్ విందు

## హాజరైన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**ప్రజానావ, సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని బౌద్ధనగర్ ప్రాంతంలో కద్రియా మసీదు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు కార్యక్రమాలు పరమత సహనానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రంజాన్ పండుగను ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం చిరకాలంగా అన్ని కులాలు, మతాల ప్రజల సహజీవనానికి నిలయంగా కొనసాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, మైనారిటీ నేత సమీర్‌తో పాటు స్థానిక మైనారిటీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ




**ప్రజానావ, ఖైరతాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రంజాన్ తోఫా కార్యక్రమాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఫిలింనగర్‌లోని బాబునాయుడు నగర్ బస్తీలో రంజాన్ తోఫా ప్యాకెట్లను బస్తీ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా అందిస్తున్న తోఫా పథకం వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. బస్తీ ప్రజలు కూడా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో నాగేశ్ సాగర్, ఆకుల రాజు, బోయ సాయిలు పాల్గొన్నారు. బస్తీ నాయకులు అబ్దుల్ గని, సలీం మాము, ఇతర బస్తీ పెద్దలతో కలిసి రంజాన్ తోఫా ప్యాకెట్లను ప్రజలకు పంపిణీ చేశారు.

# నేడు తంగళ్లపల్లిలో వైద్య శిబిరం

**ప్రజానావ, సిరిసిల్ల :** తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు, దంత వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, జనరల్ వైద్య నిపుణులు తదితర వైద్య నిపుణులు సేవలు అందించనున్నారు. ఈ శిబిరంలో వైద్యుల సేవలను ఆరోగ్యం కేంద్రం పరిధిలోని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని తంగళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కోరారు.

# ప్రజావాణికి 142 దరఖాస్తుల రాక

## అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, 142 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 56, డీఆర్డీఓకు 20, జిల్లా పంచాయతీ కార్యాలయం 14, గృహ నిర్మాణ శాఖకు 13, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 7, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కమిషనర్ కు మూడు చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారి, జిల్లా వైద్యాధికారి, మైనింగ్ శాఖ అధికారి, ఎక్సైజ్ అధికారి, సెస్ ఎండీకి రెండు చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర ఆలయం, ఈఈ ఆర్ అండ్ బీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సబ్ రిజిస్టర్ ఆఫ్ సిరిసిల్ల, ఎస్పీ కార్యాలయం కు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ఈ ప్రజావాణిలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ఆయా శాఖల తదితరులు పాల్గొన్నారు.



# ప్లాట్ కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

- ఎఫ్‌టీఎల్, అనుమతులు, లే అవుట్‌లను పరిశీలించాకే కొనుగోలు చేయాలి
- హైడ్రా హెచ్చరిక
- ప్రజావాణికి వచ్చిన 48 ఫిర్యాదులపై కమిషనర్ ఏవీ రంగనాథ్ సమీక్ష



**ప్రజానావ, హైదరాబాద్:** ప్లాట్ లేదా ఇంటి స్థలం కొనుగోలు చేసే సమయంలో పూర్తి స్థాయిలో పరిశీలించి, అన్ని అంశాలు సక్రమంగా ఉన్నప్పుడే ముందుకు వెళ్లాలని హైడ్రా సూచించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో స్థలాలు ఉన్నాయా లేదా, అనుమతి పొందిన లే అవుట్‌లా కాదా అనే విషయాలను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొంది. ఇంటి నంబరు చూపిస్తూ ప్లాట్లను లేదా బై నంబర్లతో ప్లాట్లను అమ్ముతున్న సందర్భాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ప్లాట్లు, విల్లాలు విక్రయిస్తున్నప్పుడు సంబంధిత అనుమతులను పూర్తిగా పరిశీలించాలని కోరింది. అలాగే గేటెడ్ కమ్యూనిటీ అయితే చుట్టుపక్కల కాలనీలకు కనీసం 40 అడుగుల రహదారి చూపించారా లేదా అన్నది కూడా తెలుసుకొని కొనుగోలు చేయాలని తెలిపింది. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా ఈ హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 48 ఫిర్యాదులు రాగా, వాటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా వివరాలు పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

### ఫిర్యాదులు ఇలా...

ఆనందనగర్ కాలనీ భూమి వివాదం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాటి గ్రామంలో సర్వే నంబర్లు 184 నుంచి 187తో పాటు పలు సర్వే నంబర్లలో మొత్తం 92 ఎకరాల్లో 1100 ప్లాట్లతో ఆనందనగర్ కాలనీ పేరుతో లే అవుట్ వేశారు. ఇందులో కొన్ని ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ కూడా జరిగింది. 1980లో గ్రామ పంచాయతీ లే అవుట్‌గా నమోదైనప్పటికీ మ్యూటేషన్ జరగలేదు. అనంతరం వారసులతో పాటు భూమిని గతంలో అమ్మిన రైతులు కొత్త పాస్‌బుక్లు సృష్టించి ఇతరులకు మళ్లీ విక్రయించినట్లు తెలుస్తోంది. దీంతో 92 ఎకరాల్లో దాదాపు 32 ఎకరాల భూమి వివాదాస్పదంగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తమ ప్లాట్లను కబ్జా చేసి కొత్త లే అవుట్ వేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కొన్ని ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ ఉండటంతో లే అవుట్‌ను పరిశీలించి న్యాయం చేస్తామని కమిషనర్ ఏవీ రంగనాథ్ హామీ ఇవ్వడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

### బాచుపల్లి చెరువులోకి మురుగునీరు

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి వద్ద కాకతీయనగర్ కాలనీకి ఆనుకుని ఉన్న బాచుపల్లి చెరువులోకి మురుగునీరు చేరుతున్నట్లు హరిహర హాల్‌మార్క్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో దోమలు విస్తరిస్తున్నాయని, కాలువను మళ్లించి చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చెరువును అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల వందలాది కాలనీలకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

### అమీన్‌పూర్ చెరువు సమస్య

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ చెరువులో తమ లే అవుట్లు మునిగిపోయాయని సెక్రటేరియట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. చెరువులోని నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వరుసగా లే అవుట్లు నీటమునిగాయని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్‌ను స్పష్టంగా నిర్ధారించి తమ లే అవుట్లు మునగకుండా చర్యలు తీసుకోవాలని, తప్పనిసరి పరిస్థితి ఉంటే నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా ఈ సమస్యకు పరిష్కారం లేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### పార్కు స్థలంలో దేవాలయాలు

మేడ్చల్ జిల్లా కాప్రా మండలంలోని జీఆర్ రెడ్డి నగర్ హెచ్ఎండీఏ లే అవుట్‌లో నాలుగు పార్కులు ఉండగా, ఒక పార్కులో వరుసగా దేవాలయాలు నిర్మిస్తున్నారని నివాసితులు ఫిర్యాదు చేశారు. మొత్తం 197 ప్లాట్ల నివాసితులు వినియోగించాల్సిన పార్కు స్థలంలో గుడులు నిర్మించడం బాధాకరమని పేర్కొన్నారు. లే అవుట్ ప్రకారం పార్కు కొనసాగేలాగా చర్యలు తీసుకోవాలని హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.

### పార్కు స్థలం ఆక్రమణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాలానగర్ శోభనా కాలనీలోని అక్షయ ఎన్‌క్లేవ్ లే అవుట్ 1983లో 7.12 ఎకరాల్లో 69 ప్లాట్లతో ఏర్పడింది. ఇందులో రెండు పార్కులకు స్థలం కేటాయించారు. సుమారు 1700 గజాల పార్కును ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే 200 గజాలు ఆక్రమించి షెడ్డు వేసి వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే స్పందించి పార్కును రక్షించాలని హైడ్రాను కోరారు.

# వీధి కుక్కల దాడిలో మహిళ మృతి

**ప్రజానావ, ముంబై, మార్చి 16 :** పూణే జిల్లాలోని చాకన్‌లో ఒక భయంకరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. రాత్రిపూట ఒంటరిగా వెళ్తున్న 32 ఏళ్ల మహిళపై వీధికుక్కల గుంపు దాడి చేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన మొత్తం పూణే జిల్లాను కుదిపేసింది. వీధికుక్కల సమస్యను మరోసారి తెరపైకి తెచ్చింది. పూణే-నాసిక్ హైవేలోని చకన్‌లోని అంబేతన్ చౌక్ సమీపంలో వీధికుక్కలు చేసిన భయంకరమైన దాడిలో 32 ఏళ్ల మహిళ మరణించింది. మరణించిన మహిళను శోభా విజయ్ వాగ్మారేగా గుర్తించారు. ఆమె చకన్ ప్రాంత నివాసి. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటన మొత్తం ప్రాంతంలో భయాందోళనలను రేకెత్తించింది.

### అర్ధరాత్రి జరిగిన హృదయ విదారక సంఘటన.


అందిన సమాచారం ప్రకారం, శోభా వాఘ్మారే తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో సర్వీస్ రోడ్డులోని ఫ్లైఓవర్ కింద నడుచుకుంటూ వెళుతుండగా. అకస్మాత్తుగా, ఆరు నుండి ఏడు కుక్కల గుంపు ఆమెపై దాడి చేసింది. శోభా రాళ్లను తీసుకొని కుక్కలను తరిమికొట్టడం ద్వారా తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నించింది, కానీ ఆ గుంపు ఆమెను అన్ని వైపుల నుండి చుట్టుముట్టి,దాదాపు 15 నిమిషాల పాటు ఆ మహిళపై దాడి చేసాయి. ఆమె చేతులు, కాళ్ళు, ముఖం మరియు మెడపై తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర రక్తస్రావం కారణంగా శోభా అక్కడికక్కడే మరణించింది.

### సీసీటీవీలో అసలు నిజం బయటపడింది

ఉదయం స్థానికులు నగ్నంగా ఉన్న మృతదేహాన్ని కనుగొన్నప్పుడు, దాంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కలకలం చెలరేగింది. ఇది హత్య లేదా అత్యాచారం కేసు అని అనుకున్నారు. అయితే, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన తర్వాత, చాకన్ పోలీసులు ఈ దాడిని వీధి కుక్కలు చేశాయని కనుగొన్నారు.

### హైబ్రిడ్ కుక్కలు అని అనుమానం?

స్థానికుల ప్రకారం, ఈ ప్రాంతంలోని వీధి కుక్కలు చాలా దూకుడుగా ఉంటాయి. అవి తోడేలు మరియు



కుక్కల సంకరజాతిగా అనుమానించబడుతున్నాయి. రాత్రిపూట ఒంటరిగా బయటకు వెళ్లడం ప్రమాదకరంగా మారింది. ఈ సంఘటన తర్వాత,ఈ ప్రాంత పౌరులలో భయానక వాతావరణం నెలకొంది. చాకన్ మున్సిపల్ కౌన్సిల్ యంత్రాంగం వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# మహాత్ముడి అసంపూర్తి విగ్రహంపై ఫిర్యాదు

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ గాంధీ చౌక్ ప్రధాన కూడలిలో కళ్ల జోడు లేని మహాత్ముడి విగ్రహంపై కలత చెందిన ఓ జాతిపిత మహాత్మా గాంధీ అభిమాని జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు సమర్పించాడు. సోమవారం స్థానిక నెహ్రూ నగర్ కు చెందిన కొత్వాల్ సాయిరాం అనే వ్యక్తి చేసిన ఈ ఫిర్యాదు ఇటు అధికార యంత్రాంగాన్ని అటు రాజకీయ నాయకుల దృష్టిని ఆకర్షించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి కళ్ళజోడు లేకపోవడం, ఊడిపోయి అసంపూర్తిగా ఉన్నప్పటికీ ఎవరు గమనించ లేదు. జెండా వందనాలు, అలాగే రాజకీయ నాయకులు వివిధ సందర్భాలలో మహాత్ముడికి పూలమాలలు వేయడం అనవాయితీ అయినప్పటికీ కళ్ళజోడు లేని అసంపూర్తి విగ్రహాన్ని గమనించకపోవడం విడ్డూరం. దీనిని గమనించిన సాయిరాం ఏకంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

# గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గాలికుంటు నివారణ టీకాల ప్రచార రథం ప్రారంభం




**ప్రజానావ, సిరిసిల్ల :** పశువుల పెంపకందారులు ముందస్తుగా టీకాలు వేయించి.. రోగాల బారి నుంచి జీవాలను రక్షించాలని జిల్లా కలెక్టర్ గారిమ అగ్రవాల్ సూచించారు. పశువుల సంరక్షణకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కలెక్టర్ అన్నారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం ఆద్వర్యంలో సిద్ధం చేసిన ప్రచార రథాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. పశువుల పెంపకందారులు తమ జీవాల ఆరోగ్య సంరక్షణ, ఆర్థికంగా నష్ట పోకూడదనే ఉద్దేశంతో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రభుత్వం ఉచితంగా వేయిస్తుందని పేర్కొన్నారు. అన్ని పాడి పశువులు, నాలుగు నెలల వయసు దాటిన ఎద్దులు, దూడలకు పశువుల పెంపకందారులు, రైతులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, పశు వైద్య డాక్టర్లు, సిబ్బంది 26టీమ్‌లుగా ఏర్పడి వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు టీకాలు వేస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచార రథంతో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో ఐదేళ్లలో 675 చిరుతల మృతి



- రోడ్డు ప్రమాదాల్లో 198 మృతి
- అటవీ శాఖ గణాంకాలు వెల్లడి

**ప్రజానావ, ముంబై,** మార్చి16: మహారాష్ట్రలో గత ఐదేళ్లలో 675 చిరుతలు మరణించాయని, మానవ-వన్యప్రాణుల సంఘర్షణ రోజురోజుకూ తీవ్రమవుతోందని వెల్లడైంది. వీటిలో 198 చిరుతలు రోడ్డు ప్రమాదాల్లోనే మరణించాయని వెల్లడించారు. సహజ కారణాలు, రోడ్డు ప్రమాదాలు, బావుల్లో పడటం, విద్యుదాఘాతం, వేటాడటం చిరుతపులి మరణాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఇదే కాలంలో, రాష్ట్రంలో 187 పులులు కూడా మరణించాయి, ఇది చిరుతపులి మరణం కంటే దాదాపు మూడు రెట్లు తక్కువ. సంవత్సరాంతపు పులుల మరణాల గణాంకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: 2021లో 32, 2022లో 29, 2023లో అత్యధికంగా 52, 2024లో 26, 2025లో 41, మరియు ఫిబ్రవరి 2026 చివరి వరకు 7 పులులు చనిపోయాయి. అటవీ శాఖ నుండి సమాచారం కోరిన తర్వాత సమాచార హక్కు కార్యకర్త అభయ్ కోలార్కర్ ఈ గణాంకాలను వెల్లడించారు. మహారాష్ట్రలో అత్యధికంగా చిరుతపులి మరణాలు పూణే అటవీ డివిజన్‌లో (181) నమోదయ్యాయి, తరువాత నాసిక్ డివిజన్ (161) ఉన్నాయి. సంవత్సరాల వారీగా చిరుతపులి మరణాలు: 2021లో 167, 2022లో 140, 2023లో 77, 2024లో 144, 2025లో 137, మరియు జనవరి 2026 చివరి నాటికి 10 చిరుతలు మరణించాయి. మొత్తం చిరుతపులి మరణాలలో 320 సహజ కారణాల వల్ల సంభవించగా, 198 చిరుతలు రోడ్డు ప్రమాదాల్లో మరణించాయి. దీనితో పాటు, వేటలో 17 చిరుతలు, విద్యుదాఘాతం కారణంగా 12 చిరుతలు చనిపోయాయి. పూణే జిల్లాలోని జున్నార్ ప్రాంతంలో అత్యధికంగా మానవ-వన్యప్రాణుల సంఘర్షణలు జరిగాయి. 2025 అక్టోబర్-నవంబర్‌లో, చిరుతపులి దాడుల్లో 5 మంది మరణించారు. సంఘర్షణను నియంత్రించడానికి, అటవీ శాఖ అదే సంవత్సరం 68 చిరుతపులులను పట్టుకుంది. అయితే, మాణిక్‌డోలోని రె-స్క్యూ సెంటర్ సామర్థ్యం మేరకు నిండిపోవడంతో, 50 చిరుతపులులను గుజరాత్‌లోని 'వంతరా' ప్రాజెక్టుకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఐసీయూలో మహిళ చేతిని కొరికి తిన్న ఎలుకలు

**ప్రజానావ,ముంబై, మార్చి 16:** ముంబై,భయాందర్ వెస్ట్‌లోని పండిట్ భీమ్‌సేన్ జోషి హాస్పిటల్‌లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియూ)లో చికిత్స పొందుతున్న 89 ఏళ్ల వృద్ధురాలి చేతిని ఎలుకలు కొరికి తిన్న దిగ్భ్రాంతికరమైన సంఘటన జరిగింది. సాధారణ ప్రజలకు ప్రవేశంపై కఠినమైన ఆంక్షలు ఉన్న ఐసియూ ను ఎలుకలు అక్షరాలా ఆక్రమించాయి, రోగుల భద్రత గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## ఐసియూలో ఎలుకల బెడద

ఆ దురదృష్టవంతురాలైన వృద్ధురాలి పేరు సుహాసిని మతేకర్ 89. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మార్చి 12న పండిట్ భీమ్‌సేన్ జోషి ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆసుపత్రిలోని నాల్గవ అంతస్తులోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. నిన్న రాత్రి, ఒక ఎలుక ఆమె చేతిని కొరకడం ప్రారంభించింది. ఆమె బంధువులు, ఈ ఉదయం 6 గంటలకు ఆమెను కలవడానికి ఐసియూకి వెళ్ళినప్పుడు, వారు ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటనను చూశారు.

## ఆస్పత్రి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు

బంధువులు సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి, ఆమె చేతిని కొరుకుతున్న ఎలుక పారిపోయింది, కానీ అప్పటికి వృద్ధురాలి చేతికి గాయమై, రక్తం కారుతుంది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్యులు, నర్సులు 24 గంటలూ విధుల్లో ఉన్నారు. అయినప్పటికీ, రాత్రంతా ఒక వృద్ధ మహిళను ఎలుక కొరుకుతూ ఉంది. అక్కడి సిబ్బంది దానిని గమనించలేదని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఐసియూ లో రోగులు సురక్షితంగా లేకుంటే, వారికి సురక్షితమైన చికిత్స ఎక్కడ లభిస్తుంది?" అంటూ బందువులు కోపంగా ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటన ఆసుపత్రిలోని అపరిశుభ్ర పరిస్థితులను,



అధికారుల నిర్లక్ష్యాన్ని బయటపెట్టిందని అంటున్నారు. స్థానిక పౌరులు, రోగి బంధువులు ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గ్యారంటీలపై బీజేపీ నేతల నిరసన

## పథకాలను లబ్ధిదారులకు తక్షణమే అందించాలని తాసిల్దార్ కు వినతి పత్రం



**ప్రజానావ, సిరిసిల్ల :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలను ఇప్పటి వరకు అమలు చేయకపోవడంపై' పట్టణ భారతీయ జనతా పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం సిరిసిల్ల మండలం తహసిల్దార్ కు సిరిసిల్ల పట్టణ భారతీయ జనతా పార్టీ కమిటీ పక్షాన వినతి పత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, 'ఆరు గ్యారెంటీ పథకాల లబ్ధిని తక్షణమే ప్రజలకు అందించాలని' తహసిల్దార్ ను కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం తగదని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండ నరేష్, మెరుగు శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు కనకయ్య, నరసయ్య, అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్, మోర రవి, దేవరాజు, సూరం వినయ్, అంకారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు నిర్వాసితుల హామీలు నెరవేర్చాలి

## తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత.



**ప్రజానావ, వేములవాడ:** మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వాసితుల సమస్యలపై స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ముంపు గ్రామాల్లోనే నిద్రించి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్వాసితులకు ఐదు లక్షల నాలుగు వేల రూపాయల చొప్పున చెల్లిస్తామని, పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం ఆ హామీలను విస్మరించి నిర్వాసితులను గాలికొదిలేసిందని బీజేపీ నాయకులు విమర్శించారు. ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, హామీ ఇచ్చిన నగదును వారి ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వాసితుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతపల్లి వెంకటేశ్వరరావు, యువమోర్చా నాయకులు జింక అనిల్, మండల ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కోతుల నివారణకు వినూత్న ఆలోచన

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పదవ వార్డులో కోతుల బెడదను నివారించడానికి వినూత్న ఆలోచనతో కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ వార్డులోని ముష్టిపల్లి, భూపతి నగర్, చిన్న బోనాల లో కోతుల బెడద వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు వాటిని నివారించేందుకు స్థానిక యువకుడు, మున్సిపల్ జవాన్ ఇద్దరి తో గొరిల్లా వేషధారణ వేయించడం జరిగిందని గొరిల్లా వేషధారణతో కోతులను పారద్రోలడానికి ప్రయత్నించడం జరుగుతుందని పదవ వార్డు కౌన్సిలర్ బోలగం వైష్ణవి నాగరాజు తెలిపారు.



# స్కౌట్స్ అండ్ గైడ్స్ దీక్ష స్వీకారోత్సవం

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ' దీక్ష స్వీకార కార్యక్రమం ' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది స్కౌట్స్, 16 మంది గైడ్స్' దీక్ష స్వీకారం చేశారు. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా వారికి 'స్కౌట్స్ అండ్ గైడ్స్ దుస్తులను పంపిణీ చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో 'దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, ప్రకృతి అలాగే జంతువుల పట్ల దయాగుణం, వృద్ధుల పట్ల సేవాభావం' వంటి మంచి విలువలను పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారదా, అనురాధ , తిరుపతి, గైడ్ టీచర్ కొండికొప్పుల మంజుల, స్కౌట్ మాస్టర్ తడుకల సురేష్, ఇతర ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి నెల జీతాలు చెల్లించండి

## కలెక్టర్ కు బాధిత ఉపాధ్యాయులు వినతి పత్రం

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో 30 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఐఎఫ్ఎంఐఎస్ కు ఆధార్ కార్డు లోని వివరాలు మిస్ మ్యాచ్ అవ్వడం వలన ఫిబ్రవరి నెల జీతం రాలేదు. దీని వలన ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురి అవుతున్నారు. కుటుంబ పోషణ, ఈఎంఐ చెల్లించలేకపోతున్నారు. అలాగే మార్చి నెల జీతం కూడా ఇలాగే రాకపోతే చాలా కష్టంగా ఉంటుందని దీనికోసం సోమవారం బాధ్యత ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గుండమనేని మహేందర్ రావు, కందుకూరి మధుకర్, అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి, అనిల్ కుమార్, రాంప్రసాద్, శ్యాం కుమార్ గీతభారతి తదితర బాధిత ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్గిల్ చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

## సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రం

## గుర్తించిన వారు ఆచూకీ తెలిపాలని కోరిన పోలీసులు



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు పట్టణ సీఐ ఎన్ శ్రీనివాస్ ప్రకటించారు. సోమవారం కార్గిల్ చెరువులో లభ్యమైన మహిళ వయసు సుమారు 55 65 మధ్య ఉంటుందన్నారు ఆమె ఎత్తు 4'4", గుండ్రటి ముఖం, చామనచాయ రంగులో ఉండి, లేత ఆకుపచ్చ రంగు చీర, ముదురు ఆకుపచ్చ జాకెట్ ధరించిందని, మెడలో తెలుపు, గులాబి రంగు దారం, నలుపు , బంగారు రంగు పూసల దండ కలదన్నారు. చెవులకు కమ్మలు, ముక్కుకు మక్కు పుల్లలు ఉన్నాయని, శవమును సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరచినట్టు, ఎవరికైనా ఆచూకి తెలిస్తే ఎన్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఫోన్ 8712656366, ఏ మురళీధర్ గౌడ్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఫోన్ 9989807854 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# రంజన్ తోఫా కిట్స్ పంపిణీ




**ప్రజానావ, కరీంనగర్:** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా డిస్ట్రిక్ కో -ఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ ఒక పెద్ద పండుగ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సౌభ్రాతృత్వంతో జీవించడం ఎంతో గర్వకారణమన్నారు. ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రేవంత్ రెడ్డి రంజాన్ కిట్లను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రజాపపాలన లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేసే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా సోమవారం స్థానిక అంబేద్కర్ నగర్ 27వ డివిజన్‌లో అర్హులైన ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కిట్ల పంపిణీ పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రెహ్మాన్, కలీం, మనోజ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## కలెక్టరేట్ ఎదుట టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజానావ, సిరిసిల్ల:** కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్ఎస్), సమగ్ర శిక్షా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మూడు దశల పోరాటంలో భాగంగా చేపట్టిన ఈ రెండవ దశ నిరసనలో బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గతంలో ఉద్యోగులు చేపట్టిన సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని, అలాగే అపరిమిత కాలంగా సేవలు అందిస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సంఘం నేతలు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్ రావు, జంగిటి రాజు మాట్లాడుతూ.. కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తాత్సార వైఖరిని వీడాలని హితవు పలికారు. ఉద్యోగులకు తక్షణమే హెల్త్ కార్డులు జారీ చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా క్యాజువల్ లీవ్ (జూ) వాడుకునే విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరంతర విద్యా సేవలు అందిస్తున్న సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి అంబటి రమేష్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు ఇప్పపూల దేవేందర్, ఎండి ఖయ్యూం, బుర్ర ఉపేందర్ సహా పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.



# వైభవంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణం

**పాల్గొన్న పద్మా దేవేందర్ రెడ్డి**

**భాగిర్తీ పల్లిలో కనులపండువగా వేడుకలు**

**ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఆకాంక్ష**



**ప్రజానావ, చిన్నశంకరంపేట:**

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం భాగిర్తీ పల్లి గ్రామంలో సోమవారం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కళ్యాణ మహోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కళ్యాణ తలంబ్రాల వేడుకను తిలకించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూళ్ల సావిత్రి పోచయ్య, మాజీ సర్పంచ్ దయాకర్ యాదవ్, మాజీ మండల రైతు సమన్వయ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్ లు చిలుక నాగరాజు, ఇమ్మడి నరేష్ పాల్గొన్నారు. వీరితో పాటు మండల నాయకులు పూలపల్లి యాదగిరి యాదవ్, మహిపాల్ రెడ్డి, గొండస్వామి, బందెల ప్రభాకర్, యేమ చంద్రం, పాండు యాదవ్, పోతరాజు రాజు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# బుగ్గారంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన వేముల సుభాష్

**మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు**

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా**



**ప్రజానావ, గొల్లపెల్లి):**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కప్పల శంకర్, పరుమాల మల్లవ్వ కుటుంబాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ, బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, ఉప సర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్, నక్క శంకర్, దాసర్తి రాజేశం, పెద్దనవేనీ కొమురయ్య, కలీం, దూడ పోచరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు

**పది వేల రూపాయల ఆర్థిక సాయం, యాభై కిలోల బియ్యం అందజేత**

**మృతురాలి కుటుంబ సభ్యులకు భరోసా**

**ప్రజానావ, రామాయంపేట:**

రామాయంపేట మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన హోలీయ దాసరి సంఘం సభ్యురాలు సుందరమైన నరసవ్వ అకాల మరణం చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి వారి ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కుటుంబానికి అండగా నిలుస్తూ తన వంతు సాయంగా పది వేల రూపాయల నగదుతో పాటు యాభై కిలోల బియ్యాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భవిష్యత్తులో అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ బొర్రా అనిల్, గావు భాస్కర్, శంకర్, ఆసదిరాజు, బాబు, కాలనీ పెద్దలు, స్థానికులు పాల్గొని మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలిపారు.



# భీమేశ్వరాలయ ప్రసాద తయారీ కేంద్రం తనిఖీ

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈవో రమాదేవి ఆదేశం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో లడ్డూ ప్రసాద తయారీ కేంద్రాన్ని ఆలయ ఈవో రమాదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భక్తులకు అందించే ప్రసాదాల నాణ్యత, తయారీ విధానంపై ఆమె సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ముడి పదార్థాలు, వాటి బరువు మరియు నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈవో, భక్తులకు అందజేసే ప్రసాదం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. తయారీ కేంద్రంలోని వంటశాల పరిసరాలను పరిశీలించిన ఈవో రమాదేవి, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా హెడ్ క్యాప్స్ ధరించాలని మరియు వ్యక్తిగత శుభ్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భద్రతా పరమైన చర్యలలో భాగంగా వంటశాలలో ఉన్న ఫైర్ ఎక్స్టింగ్విషర్లు పని చేస్తున్నాయా లేదా అని తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా ప్రసాదాల తయారీలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఈవో వెంట ఆలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



# మైనర్ వివాహాలపై అవగాహన

**పోలీస్ కళాబృందం పిలుపు**

**సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**


**పెద్ద ఎక్లారా గురుకుల పాఠశాలలో సదస్సు**

**ప్రజానావ, మద్నూర్:**

మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లారా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఈ సదస్సును చేపట్టింది.

**లక్ష్యంతో చదవాలి**

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని, తల్లిదండ్రుల మాట వినాలని కోరారు. ఏ చిన్న పొరపాటు చేసినా జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. కళాబృందం ఇన్‌ఛార్జ్ తిరుపతి, శేషరావు, సాయిలు తమ పాటలు, మాటల ద్వారా విద్యార్థినులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, షీ టీమ్ సభ్యులు అనిల్, పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అత్యవసర సమయంలో షీ టీమ్ సంఖ్య 8712686094, సైబర్ నేరాల కోసం 1930, తక్షణ సహాయం కోసం 100 కు కాల్ చేయాలని సూచించారు.



# వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే షిండే సందడి

- వధూవరులను ఆశీర్వదించిన జుక్కల్ మాజీ శాసనసభ్యులు
- మద్నూర్ మండల కేంద్రంలో ఘనంగా వివాహ వేడుక

**ప్రజానావ, మద్నూర్:**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన విట్టల్ గౌడ్ కుమారుడి పెళ్లి వేడుకకు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే హాజరయ్యారు. నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను పెళ్లి కుమారుడి అన్న శాలువాతో ఘనంగా సత్కరించారు.

తమ కుటుంబ వేడుకకు వచ్చి వధూవరులను దీవించినందుకు మాజీ ఎమ్మెల్యే షిండేకు పెళ్లి కుమారుడి అన్న ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు మద్నూర్, జుక్కల్ నియోజకవర్గాలలోని పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

